సాక్షి
బాపట్ల
గురువారం । 6 । ఏప్రిల్ । 2023



నేడు గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి: పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం దుర్గా మల్లేశ్వర స్వామి ప్రచార రథంతో గిరి ప్రదక్షిణ చేయనున్నారు. ఉదయం 6 గంటలకు మహా మండపం నుంచి ప్రారంభం కానుంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి టౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,800, గరిష్ట ధర రూ.6,000, మోడల్ ధర రూ.4,600 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటీ కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
బాపట్ల	6:26	4:42
గుంటూరు	6:26	4:42
నరసరావుపేట	6:28	4:39

తలుపు తట్టి.. నాడి పట్టి

- వైద్య రంగంలో విప్లవాత్మకం
- ప్రతి పేదింటికి వైద్యమే లక్ష్యం
- 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి ప్రారంభోత్సవం
- 14 రకాల వైద్య పరీక్షలు.. మందులు ఉచితం
- నేడు చిలకలూరిపేటలో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



'ఈమె షేక్ తాయిమున్నీసాబి. వయసు 72. గుంటూరు జిల్లా వేజెండ్ల గ్రామం. షుగర్, గుండె సంబంధిత వ్యాధితో మంచానికే పరిమితమైంది. రాష్ట్ర ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సిరాజుద్దీన్ ఆమె ఇంటికి వెళ్లి వైద్యసేవలు అందించారు. దీంతో ఆమెకు వైద్యశాలకు వెళ్లే పని తప్పింది. తక్షణమే వైద్యం అందింది. త్వరగా కోలుకున్నారు.'



పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం రావులాపురం గ్రామంలో వైద్యం అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సుంకర సుజాత. మాదల గ్రామం, ముప్పాళ్ల మండలం. పల్నాడు జిల్లా. 11 ఏళ్ల క్రితం ప్రసవ సమయంలో సత్తెనపల్లిలో ఓ ప్రైవేట్ వైద్యశాలలో వైద్యం వికటించి వెన్నెముక దెబ్బతినడంతో అప్పటి నుంచి మంచానికే పరిమితమైంది. తల్లి, తమ్ముడి భార్య వ్యయప్రయాసలు పడి వైద్యం అందించేవారు. ఫిజియోథెరపీకి తీసుకువెళ్లడం కష్టంగా ఉండటంతో మానేశారు. గత అక్టోబర్ నుంచి ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా నెలలో రెండు సార్లు వైద్య బృందం ఇంటికే వచ్చి వైద్యం అందించింది. ఫిజియోథెరపీ చేస్తున్నారు. ప్రస్తుతం కొంత మాట్లాడే ప్రయత్నం చేస్తోంది. వైద్యులు ఇంటికి రాగానే వచ్చి రాని మాటలతో నా కోసం వచ్చారా అంటూ నవ్వుతూ... కంట నీరు పెట్టి ఆనందంతో వైద్యుడికి స్వాగతం పలుకుతోంది.

ఫ్యామిలీ డాక్టర్ ఎంతో ప్రతిష్టాత్మకం..

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం ఎంతో ప్రతిష్టాత్మకమైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల్లోంచి ఈ విధానం పుట్టింది. విలేజ్ క్లినిక్‌లకు 104 వాహనాల ద్వారా అమలు చేస్తున్నాం. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలోని పిల్లలందరికీ పరీక్షలు నిర్వహిస్తాం. ఆయా పరీక్షల్లో ఫలితాల ఆధారంగా మెరుగైన వైద్యాన్ని అందించనున్నాం. సికిల్ సెల్ అనీమియాతో బాధపడే వారందరినీ గుర్తించి వారి బాధ్యత తీసుకుంటాం.

– విడదల రజిని, మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ సాక్షి నరసరావుపేట: భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా అమలు చేస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం 2022 అక్టోబరు నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలులో ఉంది. దీనిని అధికారికంగా గురువారం సీఎం వై.ఎస్.జగన్ చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రారంభించనున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ అంటే..

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబంలో ఎవరికైనా జబ్బు చేస్తే వైద్యుడి వద్దకు వెళ్లడం ఆనవాయితీ. రెగ్యులర్‌గా ఒకే డాక్టర్ వద్దకు ఒక కుటుంబ సభ్యుడు చికిత్స కోసం వెళుతుండటం వలన డాక్టర్, పేషెంట్ మధ్య మంచి బంధం ఏర్పడుతుంది. రోగ నిర్ధారణ సులువవుతుంది. త్వరితగతిన చికిత్స అందించే వీలుంటుంది. ఇలాంటి అత్యాధునిక వైద్య విధానాన్ని మన జిల్లాలో అమలులోకి తీసుకొచ్చారు.

ఇంటి వద్దకే సేవలు

'ఫ్యామిలీ డాక్టర్' విధానంలో ఆరోగ్య కేంద్రానికి రాలేని, ఆపరేషన్ చేయించుకుని ఇళ్ల వద్దే ఉంటున్న వారికి ఆరోగ్య కేంద్రంలో ఉండే డాక్టర్ ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించనున్నారు. సదరు వైద్యుడితో పాటు, 104 వాహనంలో ఉన్న వైద్యుడు గ్రామానికి వెళ్లి 14 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు.

గుండె జబ్బు నిర్ధారణ చేసే ఈసీజీ, రక్తహీనత నిర్ధారణ కోసం చేసే హెచ్‌బీ, జ్వరాలను నిర్ధారణ చేసే డెంగీ, మలేరియా, బీపీ, షుగర్ పరీక్షలు, హెచ్‌ఐవీ, వైరస్‌ల నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తారు. వైద్యుడితో పాటు, 104 వాహనంలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం, ఆశ వర్కర్ ఉంటారు.

67 రకాల మందులు..

ఈ విధానంలో 67 రకాల మందులను రోగులకు అందజేయనున్నారు. బీపీ, షుగర్, గుండె జబ్బులు, క్యాన్సర్‌జబ్బులు లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచుతారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన వారికి సేవలందించనున్నారు. వీరితో పాటు గర్భిణులు, చిన్న పిల్లలకు సేవలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య కేంద్రాల వైద్యులు వెళ్లి ప్రత్యేకంగా అవుట్ పేషెంట్ విభాగం సేవలు అందించనున్నారు.

గుంటూరు జిల్లాలో లబ్ధి ఇలా..

ఫ్యామిలీ డాక్టర్ విధానం గత ఏడాది అక్టోబరు 22న గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 1,60,338 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో సాధారణ రోగులు 68,832 మంది, యువతులు 203 మంది, గర్భిణులు 5,844 మంది, బాలింతలు 2,959 మంది, రక్తహీనత చికిత్స పొందిన వారు 795 మంది, అధిక రక్తపోటు(బీపీ) ఉన్నవారు 43,576 మంది, మధుమేహ వ్యాధిగ్రస్తులు(షుగర్) 37,604 మంది, నోటి క్యాన్సర్ బాధితులు 133 మంది, రొమ్ము క్యాన్సర్ బాధితులు 96 మంది, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు 238 మంది, క్షయ వ్యాధిగ్రస్తులు 58 మంది ఉన్నారు.

పల్నాడు జిల్లాలో..

జిల్లా వ్యాప్తంగా 1,40,974 మంది వైద్య సేవలు పొందారు. సాధారణ రోగులు 67,956 మంది, గర్భిణులు 8,690 మంది, బాలింతలు 5,534 మంది, రక్తహీనత చికిత్స పొందిన వారు 13,041 మంది, అధిక రక్తపోటు(బీపీ) ఉన్నవారు 31,171 మంది, మధుమేహ వ్యాధిగ్రస్తులు(షుగర్) 26,597 మంది, క్యాన్సర్ బాధితులు 205 మంది, క్షయ వ్యాధిగ్రస్తులు 20 మంది ఉన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, దళిత నాయకులు

బాపట్ల: తారతమ్యాలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పిల్లలను నైతిక విలువలతో పెంచాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్‌ఓ కె.లక్ష్మీ శివజ్యోతి, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జె.రాజదెబోరా, దళిత సంఘాల నాయకులు మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహనీయులైన జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఆయన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఆడపిల్లలను చక్కగా చదివించాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజలను చైతన్య పరచడంలో జగ్జీవన్‌రామ్ సఫలీకృతులయ్యారని కొనియాడారు. భారత రత్న ప్రకటించేలా జిల్లా కలెక్టర్ కేంద్రానికి లేఖ రాయాలని, బాపట్ల జిల్లాలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎస్సీ సంఘాల నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సంఘాల నాయకులు జి.చారువాక, ఇనగలూరి మాల్యాద్రి, పల్నాటి శ్రీరాములు, మండే విజయ్‌కుమార్, నాగమల్లి, జె.రత్నకుమార్, రవికుమార్, జి.వందనం, సిహెచ్.కిరణ్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

11న జిల్లా స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్(క్రీడలు): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ అండర్–25 మెన్, సీనియర్స్ మెన్ విభాగాల్లో జిల్లా స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకలగుంట క్రికెట్ మైదానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు సొంత కిట్‌తో రావాలని కోరారు.

జెడ్పీ స్కూళ్ల సిబ్బందికి యూనిఫాం పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న నాలుగో తరగతి సిబ్బందికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా యూనిఫాం పంపిణీ చేశారు. జెడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనూరాధ, జెడ్పీ సీఈఓ జె.మోహనరావు పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై తిరుమంజన సేవ



తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై అష్టలక్ష్ముల ప్రతిష్టా వార్షిక వేడుకలు బుధవారం ముగిశాయి. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు లక్ష్మీనారాయణులకు, పద్మావతి అమ్మవారికి తిరుమంజన సేవ, అలంకరణలు నిర్వహించారు. అనంతరం 12 గంటల వరకు 9 సన్నిధులలో తులసి దళాలతో సహస్ర నామార్చన, కుంకుమార్చన చేశారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తెలిపారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి



గుంటూరు లీగల్: విద్యా, ఉపాధిలో అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు బాబూ జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి అన్నారు. భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం గుంటూరు బార్ అసోసియేషన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. సమావేశానికి జీబీఏ ప్రెసిడెంట్ కె.వి.కె.సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎక్సైజ్ కోర్టు ఏపీపీగా పని చేస్తూ జిల్లా జడ్జిగా ఎంపికైన అబ్రహంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నకుమార్ పాల్గొన్నారు.

నేడు సీఎం వైఎస్ జగన్ రాక



ఏర్పాట్లను మంత్రి విడదల రజినికి వివరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, చిత్రంలో ఎమ్మెల్సీ తలశిల

- లింగంగుంట్లలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభోత్సవం
- సీఎం బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి

చిలకలూరిపేట: సామాన్యుల ఆరోగ్యవరప్రదాయని ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. వైద్య ఆరోగ్యరంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం అధికారికంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని ప్రారంభించనున్నారు. దీనికి పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామం వేదిక కానుంది. ముఖ్యమంత్రి రాకకోసం వారం రోజులుగా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలకు అనుకూలంగా ఉండేలా చిలకలూరిపేట– నరసరావుపేట రోడ్డుకు సమీపంలోనే సభావేదిక ఏర్పాటు చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సొంత నియోజకవర్గం కావడంతో ఆమె ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దీనికి తోడు ఎమ్మెల్సీ, ప్రోగ్రామ్స్ కమిటీ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్ కూడా ఏర్పాట్లతో పూర్తి స్థాయి నిమగ్నమై ఉన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు ప్రతి రోజూ లింగంగుంట్ల గ్రామానికి విచ్చేసి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే హెలిప్యాడ్, సభావేదిక, సభా ప్రాంగణం ఏర్పాటు పనులు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. వేసవి కాలం కావడంతో బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లను ఏర్పాటు చేస్తున్నారు. భోజన ఏర్పాట్లు చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట, పోతవరం, నాదెండ్ల, అప్పాపురం వైపు నుంచి లింగంగుంట్లకు వచ్చే రహదారుల్లోనే పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఇప్పటికే పోలీసు అధికారులకు మంత్రి విడదల రజిని సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఈ దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు. అధికారులు ముఖ్యమంత్రి కాన్వాయ్ ట్రయల్ రన్‌ను బుధవారం నిర్వహించారు.

పర్యటన ఇలా...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి తాడేపల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 9.40కు బయలుదేరి 10 గంటలకు లింగంగుంట్ల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులతో మాట్లాడి లింగంగుంట్లలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్‌కు వెళ్తారు.

విలేజ్ హెల్త్ సెంటర్ పరిశీలన అనంతరం 10.25కు సమీపంలోని ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ స్టాళ్లను పరిశీలించనున్నారు. తదుపరి 10.42లకు సభా ప్రాంగణానికి వస్తారు. 11 గంటల నుంచి 11.30 వరకు సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు. 11.40కు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ స్థానిక నాయకులతో మాట్లాడిన తరువాత మధ్యాహ్నం 12 గంటలకు తాడేపల్లికి తిరుగు ప్రయాణం అవుతారు.



లింగంగుంట్లలో ముస్తాబైన సభా ప్రాంగణం

ఉపాధిలో అగ్రస్థానం

- 2.95 లక్షల మందికి పని
- ఏడాదిలో రూ.257.10 కోట్లతో పనులు
- కూలీలకు రూ.154.50 కోట్లు
- మెటీరియల్‌కు రూ.102.60 కోట్లు
- మహిళలకు 54.46 శాతం పనులు
- ఎనిమిదేళ్లలో రికార్డు స్థాయిలో పనులు



ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో రికార్డు స్థాయిలో ఉపాధి హామీ పనులు చేపట్టారు. 2.95 లక్షల మందికి ఉపాధి దొరికింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ. 257.10 కోట్లు విలువ చేసే పనులు పూర్తి చేశారు. జిల్లాలో 2022–23లో ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉపాధి పనులు చేపట్టింది. వివిధ రకాలకు సంబంధించి మొత్తం 44 వేల పనులు మొదలు పెట్టారు. ఇందులో సుమారు 20వేలకు పైగా పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కూలీలకు రూ.154.50 కోట్లు, మెటీరియల్ కింద రూ. 102.60 కోట్లు వెచ్చించారు.

పనులు ఇలా..

ఉపాధి హామీ పథకం ద్వారా ప్రధానంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లీనిక్‌లు, నాడు–నేడు, విద్యా, వైద్యం తదితర విభాగాల పరిధిలో భవన నిర్మాణాలు, ప్రహరీలు, తదితర వాటికి నిధులు వెచ్చించారు. వీటితో పాటు సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, వ్యవసాయం అనుబంధ రంగాల పరిధిలో మరిన్ని పనులు చేపట్టారు. అమృత్ సరోవర్ పథకం పరిధిలో చెరువుల ఆధునీకీకరణలో భాగంగా చెరువు కట్టలు, తూములతోపాటు ఇన్‌లెట్, అవుట్‌లెట్ల ఆధునీకీకరణ పనులు చేపట్టారు. పండ్లతోటల పెంపకంకోసం ఉపాధిహామీలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు.

ఉపాధితో ఉపాధి...

జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 2.95 లక్షల మంది కూలీలకు పనులు కల్పించారు. ఇందులో 7,787 కుటుంబాలు 100 రోజుల పనిదినాలను పూర్తి చేశారు. రోజు వేతనం ఒక్కొక్కరికీ సగటున రూ. 257 ఇవ్వాల్సి ఉండగా చేసిన పనుల క్వాంటిటీ తక్కువగా నమోదు కావడంతో ఒక్కొక్కరికీ సగటున రూ.203.10 చెల్లించారు. మొత్తంగా 54.46 శాతం మంది మహిళలకు పనులు కల్పించగా ఎస్సీలకు 35.98 శాతం, ఎస్టీలకు 3.55 శాతం పనులు కల్పించారు. మొత్తంగా గతేడాదిలో 72.84 లక్షల పనిదినాలు (98.43 శాతం) కల్పించారు. ప్రతి 15 రోజులకు ప్రభుత్వం కూలీలకు క్రమం తప్పకుండా డబ్బులు చెల్లించింది.

ఉపాధిలో రికార్డు..

గడిచిన ఎనిమిదేళ్లలో గతేడాది ప్రభుత్వం అత్యధికంగా రికార్డుస్థాయిలో ఉపాధి పనులు కల్పించింది. 2018–19లో అత్యధికంగా 70.50 పనిదినాలు కల్పించగా గత ఆర్థిక సంవత్సరంలో దీనిని 72.84 లక్షల పనిదినాలకు పెంచి రికార్డు సృష్టించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, డ్వామా పీడీ శంకర్‌నాయక్ క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బందిని నిత్యం అప్రమత్తం చేస్తూ పనులు పర్యవేక్షించి లక్ష్యం మేరకు ఉపాధి పనులు జరిగేలా చూశారు.

ఉపాధిలో రికార్డు పనులు



జిల్లాలో గతేడాది రికార్డు స్థాయిలో ఉపాధి పనులు చేయించాం. మొత్తం 44 వేల పనులు చేపట్టాం. ఈ పనుల కోసం రూ. 257 కోట్లు ఖర్చు చేశాం. 2.95 లక్షల మంది కూలీలకు పనులు కల్పించాం. మొత్తం 72.84 లక్షల పనిదినాలు కల్పించాం. రాబోయే ఏడాది ఇంతకు మించి పనులు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– శంకర్‌నాయక్, డ్వామా పీడీ

175 స్థానాల్లో పోటీచేసే దమ్ముందా..

చంద్రబాబుకు ఎంపీ మోపిదేవి సవాల్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసే దమ్ము మాకుంది.. అన్ని స్థానాల్లో పోటీచేసే దమ్ము నీకుందా చంద్రబాబు అని రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సవాల్ విసిరారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. వైఎస్ జగన్‌కు అండగా నిలిచేందుకు ప్రజలు సిద్ధమని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటుతో లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని చెప్పారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాలుగు ఓట్లు పడగానే వాపును బాబు బలుపుగా భావిస్తున్నారని మోపిదేవి ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లోనూ ప్రజలు టీడీపీని బంగాళాఖాతంలో విసరటం ఖాయమని చెప్పారు.

వైభవంగా వసంతోత్సవం

పూర్ణాహుతితో ముగిసిన చైత్రమాస బ్రహ్మోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న చైత్రమాస బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. పూర్ణాహుతిలో ఉత్సవాలు లాంఛనంగా పూర్తి కాగా, వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో భ్రమరాంబ, ఆలయ అధికారులు పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం వేద ఆశీర్వచనం, ధాన్యకోట్నోత్సవం, వసంతోత్సవాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ రాంబాబు దంపతులు, ఈఓ భ్రమరాంబ, వేద పండితులు ఒకరిపై ఒకరు రంగులు, గులామ్ చల్లుకుంటూ వేడుకలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఉత్సవ మూర్తులకు దుర్గాఘాట్‌కు తీసుకెళ్లారు. నదీతీరంలో ఉత్సవ మూర్తులకు అవభృత స్నానం జరిపించి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, అర్చక సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మూకబలి ధ్వజావరోహణం వంటి వైదిక కార్యక్రమాలను జరిపించారు.



పూర్ణాహుతి జరిపిస్తున్న ఆలయ అర్చకులు, హాజరైన చైర్మన్ రాంబాబు, ఈఓ భ్రమరాంబ

మహిళల ఆర్థికాభివృద్ధే రాష్ట్రాభివృద్ధి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



రేపల్లెలో మెగా చెక్కు పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లె రూరల్: మహిళల ఆర్థికావృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కుల పంపిణీలో భాగంగా పట్టణంలోని ఒక కల్యాణ మండపంలో రేపల్లె మండలంలోని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి అనంతరం మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నూరుశాతం అమలు చేస్తున్నారన్నారు. ప్రతి మహిళకు అన్నగా, తమ్ముడిగా, కొడుకుగా, మనవడిగా అనేక రూపాలలో చేదోడుగా నిలుస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వంగాని, నాయకుడుగాని చేయనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి మహిళ అండగా నిలవాలన్నారు. మహిళలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా 1309 మహిళా గ్రూపులకు రూ.10.84కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవపల్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, జడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గరికపాటి భానుకోటి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

ప్రయాణీకులకు మెరుగైన భద్రత

దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ రవీంద్రనాథ్ రెడ్డి



రేపల్లె రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి

రేపల్లె రూరల్: రైల్వే ప్రయాణీకులకు మెరుగైన భద్రత కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రేపల్లె రైల్వేస్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నడికుడి సెక్షన్‌లోని గుంటూరు–తెనాలి–రేపల్లె స్టేషన్‌లలో ప్రయాణీకులకు అందుతున్న భద్రతపై పరిశీలించేందుకు తాము వచ్చామన్నారు. రెండు రోజుల పాటు ఆయా స్టేషన్‌లలో భద్రత పరమైన అంశాలను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక తయారు చేస్తామన్నారు. రిజర్వేషన్‌ల బోగీలలో ప్రయాణీకుల భద్రత కోసం ప్రతి బోగీకి ఒక గార్డును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీంతోపాటుగా రైల్వే ట్రాక్‌ల భద్రతను పరిశీలించి పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నాయకుల నుంచి విన్నపాలు స్వీకరించారు. ఆయన వెంట ఏడీఆర్ఎం సైమన్, ఇతర అధికారులు బ్రహ్మానందరెడ్డి, రవిచంద్ర, ఎం.శ్రీనివాస్, మనోజ్‌కుమార్ గుప్త, మునిరెడ్డి, నాగయ్య, తదితరులున్నారు.

అక్రమ దందాకు అడ్డే లేదు!

- కార్డుదారుల నుంచి చౌకగా బియ్యం కొనుగోలు
- జిల్లా సరిహద్దు నుంచి జోరుగా దందా
- కర్ణాటకలో మూడు రెట్లు అదనంగా విక్రయాలు
- అధికారులు దాడులు చేస్తున్నా ఆగని బియ్యం అక్రమ రవాణా



రేణింగవరం పోలీస్ స్టేషన్ వద్ద పట్టుకున్న రేషన్ బియ్యం వాహనం (ఫైల్)

జే.పంగులూరు: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) పేదలకు ఆహార భద్రత కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇదివరకటిలా ముక్కిపోయిన బియ్యం కాకుండా, ఖర్చుకు వెనకాడకుండా నాణ్యమైన బియ్యాన్ని చౌకదుకాణాల ద్వారా కార్డుదారులకు అందిస్తోంది. ఈ బియ్యంపై మాఫియా కన్ను పడింది. పేదల ఆర్థిక ఇబ్బందులు ఆసరాగా తీసుకొని వారి నుంచి బియ్యం కారు చౌకగా కొనుక్కుని పొరుగు రాష్ట్రంలో మూడు రెట్లకు అదనంగా అమ్మి సొమ్ము చేసుకుంటోంది. మాఫియాగా ఏర్పడిన వారు బియ్యం దందాను వృత్తిగా ఎంచుకున్నారు. కర్ణాటక సరిహద్దులకు ఆనుకుని ఉన్న జిల్లాలోని పలు ప్రాంతాల మీదుగా బియ్యం తరలించేస్తున్నారు. అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా నామమాత్రపు జరిమానాలు చెల్లించి మళ్లీ దందా కొనసాగిస్తున్నారు.

10కి కొని 40కి అమ్మి..

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న బియ్యంపై కిలోకు రూ.38.50 ఖర్చు చేస్తోంది. అయితే బియ్యం మాఫియాదారులు కిలో రూ.10కే ఈ బియ్యం కొంటున్నారు. ఇంటింటికీ తిరిగి బియ్యం సేకరించి 50 కిలోల సంచుల్లో ప్యాకింగ్ చేస్తున్నారు. అనంతరం బళ్లారి, బెంగళూరు, బంగారు పేట, పాపగడ, చిక్‌బళ్లాపూర్ తదితర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఈ బియ్యాన్ని కిలో రూ.40 దాకా విక్రయించి జేబులు నింపుకొంటున్నారు.

మూడు నెలల్లో 32 కేసులు..

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాల అధికారులు తరుచూ దాడులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు బాపట్ల జిల్లా వ్యాప్తంగా 32 కేసులు నమోదు చేశారు. 208.60 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కిలో బియ్యానికి ప్రభుత్వం రూ.38.50 వెచ్చిస్తోంది. ఆ లెక్కన అధికారులు స్వాధీనం చేసుకున్న ఈ బియ్యం విలువ రూ.8.03 లక్షలు.

కఠిన శిక్షలు లేకనే..

రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులపై కఠిన శిక్షలు లేకపోవడం వల్లే దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమంగా తరలుతున్న బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై 6 ఏ కేసు నమోదు చేస్తారు. ఈ కేసులు జాయింట్ కలెక్టర్ విచారణ చేసి జరిమానా విధిస్తారు. అలా కాకుండా స్టోర్ బియ్యం అక్రమంగా రవాణా చేసే వ్యక్తులకు కఠిన శిక్షలు అమలు చేస్తే కొంత వరకు కట్టడి చేసే అవకాశం ఉంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

జిల్లాలో గత మూడు నెలల్లో నమోదయిన కేసులు. .

నియోజక వర్గం	6 ఏ కేసులు	పట్టుబడ్డ బియ్యం క్వింటాల్లో
వేమురు	3	84.42
రేపల్లె	2	41.21
బాపట్ల	3	21.00
చీరాల	8	17.41
పర్చూరు	12	32.24
అద్దంకి	4	12.32

అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి..

బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లా నుంచి రవాణా జరిగే మార్గంలో నిఘా పెట్టాం. పౌర సరఫరాల అధికారులు దాడులు నిర్వహిస్తూ అక్రమ రవాణా ఆపుతూ బియ్యం పట్టుకుంటున్నాం. అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై 6ఏ కేసులతో పాటు కఠినమైన చర్యలు తీసుకుంటున్నాం.

– డీసీఎస్ఓ ఈబీ విలియమ్స్

సమతావాది బాబూ జగ్జీవన్‌రామ్

ఘన నివాళులర్పించిన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె: దేశ స్వాతంత్ర్య సమరంలో తన సేవలను అందించటమే కాకుండా స్వాతంత్ర్యం అనంతరం దేశాభివృద్ధిలో బాబు జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివని రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. జగ్జీవన్‌రామ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సమతావాది అన్నారు. కేంద్రంలో అనేక మంత్రి పదవులు చేపట్టి ఆ పదవులకే వన్నె తెచ్చిన ఘనత జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందన్నారు. యువత జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదుట ఉన్న జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మహిళా కన్వీనర్ కొత్తపల్లి శ్రీవాణి, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం పోరాడిన ధీరుడు..



నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ పి.మహేష్

బాపట్లటౌన్: సామాజిక సమానత్వం కోసం పోరాడిన ధీరుడు బాబూ జగ్జీవన్ రామ్ అని అడిషనల్ ఎస్పీ పి.మహేష్ తెలిపారు. దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతిను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. తొలుత జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అడిషనల్ ఎస్పీ పి. మహేష్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తి దాయకమన్నారు. అంటరాని వారికి సమానత్వం కల్పించడం కోసం అంకితమైన ఆయన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ స్థాపనలో కీలక పాత్ర పోషించారన్నారు. 30 సంవత్సరాల పాటు వివిధ శాఖల్లో మంత్రిగా పనిచేశారని, ఉప ప్రధానిగా పనిచేశారని సమాజ హితంకోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అన్నారు. నివాళులర్పించిన వారిలో ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, అడ్మిన్ ఆర్ఐ ఐ.మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ ఐ.శ్రీకాంత్‌నాయక్ పాల్గొన్నారు.

ఆర్మీ మేజర్‌నంటూ మహిళలకు వల

- నకిలీ గుర్తింపు కార్డులతో మోసం
- నిందితుడి సెల్‌ఫోన్‌లో మహిళల నగ్నచిత్రాలు
- ఆర్మీ నాయక్‌ను అరెస్ట్ చేసిన దిశ పోలీసులు



పట్నంబజారు: ఆర్మీలో కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగం.. కానీ మేజర్‌నని చెప్పుకుంటాడు.. నకిలీ ఐడీ కార్డులు తయారు చేయిస్తాడు.. తన భార్యతో విడాకులు తీసుకున్నానని చెబుతాడు.. మహిళలకు మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడతాడు.. ఆఖరికి ఒక మహిళ ధైర్యం చేసి ఫిర్యాదు చేయటంతో కటకటాల పాలయ్యాడు. దిశ పోలీసుస్టేషన్‌లో బుధవారం సీఐ డి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన ఒక మహిళకు 2016లో వివాహం జరిగింది. 2020లో బ్యాంకులో పనిచేసే భర్త ప్రమాదంలో మృతి చెందటంతో ఆమెకు ఆ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఆమె గుంటూరులోని ఒక బ్యాంకులో పని చేస్తున్నారు. ఈ క్రమంలో మూడు నెలల కిందట షాదీ.కామ్‌లో బిళ్లా పవన్‌కుమార్ అనే వ్యక్తి ఆమెకు పరిచయం అయ్యాడు. తాను రాజస్థాన్‌లో మేజర్‌గా పనిచేస్తున్నానని, తనది గుంటూరు అని నమ్మబలికాడు. ఇరువురి మధ్య బాగా పరిచయం ఏర్పడిన తరువాత తన బాబుకు ప్రమాదం జరిగిందని అత్యవసరంగా రూ. 50వేలు తీసుకున్నాడు. తరువాత తనకు లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి వచ్చిందని, బెంగళూరు పోస్టింగ్ ఇచ్చారని చెప్పుకొచ్చాడు. తరువాత హైదరాబాద్, గుంటూరు వచ్చిన ఆమెను కలిసి అసభ్యకరంగా ప్రవర్తించసాగాడు. దీనితో అతని ప్రవర్తన చూసిన ఆమె తనకు ఫోన్ చేయొద్దని, చెప్పిన క్రమంలో గత నెల 31వ తేదీన తెనాలి రమ్మని పిలిచి, రాకపోతే ఇద్దరం కలిసి దిగిన ఫొటోలు, సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరింపులకు పాల్పాడ్డాడు. దీనిపై బాధితురాలు దిశ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఎంతో మంది మహిళలకు వల...

మహిళ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన దిశ పీఎస్ సీఐ నరేష్ నిందితుడిని గుర్తించారు. ప్రకాశం జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెంలోని తోటవారిపాలెంకు చెందిన డక్కుమళ్ల సుదర్శనరావు అలియాస్ బిళ్లా పవన్‌కుమార్‌గా గుర్తించారు. నిందితుడు సుదర్శనరావును అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం, అతని ఫోన్‌లో సుమారు 50 మంది మహిళల ఫోన్ నెంబర్‌లు గుర్తించటంతో పాటు, వారికి ఫోన్ చేసి ఈ విషయాన్ని వెల్లడించి మోసపోవద్దని సూచించినట్లు సీఐ నరేష్ తెలిపారు. బాధిత మహిళకు సంబంధించి వాట్సాప్ వెబ్‌ను ఆమెకు తెలియకుండా యాక్సెస్ చేసి దిగిన ఫొటోలు, ఇతరత్రా వివరాలు ఆమె బంధువులకు పంపుతామని బెదిరించినట్లు గుర్తించారు. ఆర్మీలో నాయక్ హోదాలో పనిచేసే సుదర్శన్, కేవలం తన కోరికలు తీర్చుకునేందుకు, డబ్బులు కోసం మహిళలను మోసం చేస్తున్నాడని తెలిపారు. అయితే షాదీ.కామ్‌తో పాటు ఇతర యాప్‌ల ద్వారా మహిళలను పరిచయం చేసుకుని అందరినీ ఇదే విధంగా మోసం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. 2016లో దీపిక అనే మహిళను వివాహం చేసుకున్న నిందితుడికి ఇద్దరు సంతానం ఉన్నారు. మహిళలను నమ్మించేందుకు మేజర్ దుస్తుల్లో ఉన్న ఫొటోలను పెట్టి మోసం చేస్తాడు. కొంతమంది మహిళల నగ్న చిత్రాలు కూడా సుదర్శన్ సెల్‌ఫోన్‌లో గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, సెయింట్ జోసఫ్ ఆసుపత్రి వద్ద నిందితుడిని బుధవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి నకిలీ, ఒరిజనల్ ఐడీ కార్డులు, రబ్బర్ స్టాంపులు, షోల్డర్ బ్యాడ్జీలు, రెండు మొబైల్‌ఫోన్‌లు, ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

అశ్రునయనాల నడుమ మోహన్‌బాబు అంత్యక్రియలు

హాజరైన సినీ ప్రముఖులు సురేష్‌బాబు, వెంకటేష్, రానా, నాగచైతన్య, అభిరామ్



మోహన్‌బాబు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటేష్, రానా, నాగచైతన్య, అభిరాం




అంతిమ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కరణం బలరాం, వెంకటేష్

కారంచేడు: మూవీ మొఘల్, బాపట్ల మాజీ పార్లమెంట్ సభ్యుడు, దివంగత సినీ నిర్మాత దగ్గుబాటి రామానాయుడు సోదరుడు, నిర్మాత దగ్గుబాటి రామ్మోహన్‌రావు (మోహన్‌బాబు) (72) మంగళవారం ఉదయం బాపట్ల జిల్లా కారంచేడులో మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. ఆయన అంత్యక్రియలు అభిమానులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య బుధవారం సాయంత్రం కారంచేడు హిందూ శ్మశాన వాటికలో నిర్వహించారు. మోహన్‌బాబు మృతదేహానికి ఆయన మనుమడు వెంకటసాయి (చిన్నకుమార్తె స్వరూప కుమారుడు) అంత్యక్రియలు నిర్వహించాడు.

అంత్యక్రియలకు హాజరైన వెంకటేష్, రానా, నాగచైతన్య..

మోహన్‌బాబు అంత్యక్రియల్లో సినీ హీరోలు దగ్గుబాటి వెంకటేష్, దగ్గుబాటి రానా, అక్కినేని నాగచైతన్య, దగ్గుబాటి అభిరామ్‌లు హాజరై మోహన్‌బాబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నాన్న మృతదేహాన్ని చూసి వెంకటేష్ కన్నీరు పెట్టుకున్నారు. మంగళవారం నుంచి గ్రామంలోనే ఉన్న నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు, మోహన్‌బాబు బావమరిది, సినీ నటుడు కొల్లా అశోక్‌లు దగ్గరుండి అంత్యక్రియల ఏర్పాట్లను పరిశీలించారు. మోహన్‌బాబు పార్థివ దేహంతో ప్రారంభమైన అంతిమ యాత్రలో కొంత దూరం వెంకటేష్, రానా, నాగచైతన్యలు పాడెను మోశారు. అయితే అప్పటికే అభిమానుల తాకిడి పెరగడంతో వారు వెనుతిరిగి ఇంటికి చేరుకున్నారు. మృతదేహానికి చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌బాబు, చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు సందర్శించి నివాళులర్పించారు. మోహన్‌బాబుకు భార్య శారదాదేవి, కుమార్తెలు మాధవి, స్వరూప ఉన్నారు. అంత్యక్రియల్లో డాక్టర్ రామానాయుడు సతీమణి రాజేశ్వరి, కుమార్తె లక్ష్మి ఆమె కుటుంబ సభ్యులు, సురేష్‌బాబు భార్య లక్ష్మి, హీరో వెంకటేష్ భార్య నీరజ, రానా భార్య మిహీకా, మనుమళ్లు, మనుమరాళ్లతో పాటు సినీ నిర్మాతలు, గ్రామస్తులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య



మృతుడు ఆంజనేయులు (ఫైల్)

చినగంజాం: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చినగంజాం ఎస్ఐ కట్టా అనూక్ ఇచ్చిన వివరాల మేరకు.. మండలంలోని పల్లెపాలెం పంచాయతీ పడమటి పల్లెపాలెం గ్రామానికి చెందిన పీతా ఆంజనేయులు (50) చేపల వేట వృత్తిగా జీవనం చేస్తున్నాడు. అతడు మద్యానికి బానిస కావడంతో విసిగి పోయిన కుటుంబ సభ్యులు మద్యం మానుకోమని చెప్పారు. దాంతో ఆంజనేయులు అలిగి ఈ నెల 2వ తేదీ వెళ్లిపోయాడు. అలిగి వెళ్లిన అతడు ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులను చుట్టు పక్కల వారిని విచారిస్తున్నారు. ఈ క్రమంలో 5వ తేదీ బుధవారం ఉదయం పెద్దపల్లెపాలెం బీచ్‌కు 100 మీటర్ల దూరంలో సరుగుడు చెట్లకు ఉరివేసుకొని చనిపోయినట్లు గుర్తించారు.

రవాణా శాఖ ఆదాయం రూ. 231.16 కోట్లు

పట్నంబజారు: 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గుంటూరు ఆర్టీఏకు రూ.231.16 కోట్ల ఆదాయం వచ్చినట్లు డీటీసీ కరీం చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 200.65 కోట్లు రాగా, ఈ ఆర్థిక సంవత్సరం అధికంగా రూ.30.48 కోట్లు (15శాతం అధికం) ఆదాయం వచ్చినట్లు తెలిపారు. త్రైమాసిక పన్నుల రూపంలో రూ.47.49 కోట్లు, జీవిత కాలం పన్ను రూపంలో రూ. 150.56 కోట్లు, సీజ్ రూపంలో రూ. 17.24 కోట్లు, సర్వీస్ చార్జీల రూపంలో రూ. 3.86 కోట్లు, వాహనాల తనిఖీల రూపంలో రూ. 11.99 కోట్లు కలిపి, మొత్తం రూ.231.16 కోట్లు ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. గుంటూరు ఆర్టీఏ 131.57 శాతం సాధించి రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు.